# కరివేపాకు

ఎప్పటిలాగే తెల్లవారింది.

శాస్త్రిగారు నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకున్నారు. పూజ చేసుకుని- టిఫిన్ తిని పడక కుర్చీలో కూర్చున్నారు. పేపరు చూసి పక్కన పడేశారు.

పదిగంటలు అవుతున్నది.

అలవాటు చొప్పున కుర్చీలోంచి లేచి చెప్పులు తొడుక్కుని బయలు దేరారు.

"ఏమేవ్! ఆఫీసుకు పోయొస్తా!"

గుమ్మం దిగబోతున్న శాస్త్రిగార్కి వెనుక తన సతీమణి మాటలు వినిపించాయి.

"ఏమండోయ్! మీ మతిమరుపు మండ! ఆఫీసు కెళుతున్నారా? ఎందుకండి? దండగ- యింట్లోనే కూర్చుని రెస్టు తీస్కోండి."

చివుక్కుమంది శాస్త్రిగారి మనసు.

"నిజమే తను నిన్ననే రిటైర్అయ్యాడు. ఆ సంగతి మర్చిపోయి అలవాట్లో పొరపాటుగా ఆఫీసుకు బయలుదేర బోయాడు అని అనుకొన్నాడు.

"అయితే ఏం? నాకు బోల్డు పనులున్నాయి- ఓసారి పోయొస్తా- తలుపేసుకో" అనేసి ఇంటి బయటికి వచ్చేశాడు.

వీధిలో నడుస్తూంటే వింతగా వుంది.

జనమంతా హడావిడిగా పరుగులు తీస్తున్నట్లుంది కామెడీ కోసం సినిమాల్లో స్పీడ్‌మీద రీలువేసి పాత్రల్ని పరుగెత్తించడం గుర్తుకొచ్చింది. 'ఏవిటో అంతా హడావుడి! కాలప్రవాహంలో కొట్టుకుపోతున్న గడ్డి పరకలు!' అనుకొంటూ మెట్టవేదాంత ధోరణిలో చిన్నగా నిట్టూర్చాడు.

శాస్త్రిగార్కి క్రితంరోజు గొప్పగా వీడ్కోలు జరిగింది ఆఫీసులో. ఆయనొక ప్రైవేటు రంగంలో పనిచేసి నిన్ననే రిటైరయ్యారు- ముప్పైఏళ్ళ సుదీర్ఘ జీవితం ఆ కంపెనీలో గడిపేశారు.

నిన్న జరిగిన సభలో పై అధికార్లు- ఉద్యోగులు- తదితరులు మాట్లాడటం గుర్తుకొచ్చింది.

"ముప్పైఏళ్ళ సర్వీసులో శాస్త్రిగారు మచ్చలేకుండా పనిచేశారు. వారు చేరినప్పుడు ఈ కంపెనీ చాలా చిన్నది. వారి సేవల మూలంగా కంపెనీ పెరిగింది.వారి హోదా కూడ పెరిగింది. ఇది కేవలం తన సొంత కంపెనీ అనుకుని మనసా వాచా కర్మణా ఆయన తన వృత్తులు నిర్వహించి మనందరి మన్ననలు పొందారు.వారిలోటును ఎవరూ భర్తీ చేయలేరు-" శాస్త్రిగారి ఆఫీసరు అనంతంగారు అనంతంగా పొగిడేసి కూర్చున్నారు.

"శాస్త్రీగార్కి కోపంరాగానే ఎరుగను- నేచేరి పదిహేను సంవత్సరాలైంది. ఈ పదిహేనేళ్ళల్లో వారి వదనంలో చిరునవ్వునే ఆభరణంగా చూశాను. ఈ వయసులోకూడ వారు మా అందరి యువకులకంటే ఉత్సాహంగా పని చేయడం గమనించాను... అంతేకాదు... తన సీట్లో పని అయింతర్వాత ఆయన చాలామందికి సాయం చేశారు-" శాస్త్రీగారిశిష్యుడు శర్మ ఊదరకొట్టేశాడు అందర్ని.

"శాస్త్రిగారు యూనియన్ సెక్రెటరీగా చాలా సంవత్సరాలు పనిచేశారు-వారి కాలంలో ఎన్నోసార్లు మేనేజిమెంటుకు- ఎంప్లాయీస్‌కు క్లాషెస్ వచ్చాయి. కాని వాటన్నిటిని కడుంగడు సమర్థవంతంగా పరిష్కరించారు. అటు మేనేజిమెంటును- ఇటు యూనియన్ మెంబర్లను నొప్పించ కుండా ఎన్నో కోర్కెలు సాధించారు." అని ఆవేశ పూరితంగా ఓ యూనియన్ లీడర్ ఉపన్యాసం యిచ్చాడు "యూనియన్ జిందాబాద్!" అని కూర్చున్నాడు చివర్కి.

"ఆడవాళ్ళం ఆఫీసులో ఎలా మెసలాలని మొదట్లో భయపడే వాళ్ళం-కాని శాస్త్రిగారు కన్నతండ్రిలాగా మా వెంట ఉండి మా కష్టాలు-గమనించి మా సమస్యల్ని సానుభూతితో అర్థం చేసుకొని-మాకు ప్రత్యేక డైనింగ్‌హాల్-సివిక్ అమెనిటీస్ ఏర్పాటు చేయించారు. అందుకు మేమెంతో రుణపడి ఉంటాం". అంటూ మహిళాకార్యదర్శి ఆయన్ని పొగిడింది.

అందరూ తన్ను ఇంద్రుడూ చంద్రుడు అని పొగుడుతూంటే ఉబ్బితబ్బయి పోయారు శాస్త్రిగారు- ఆనందంతో ఆయన కళ్ళు చెమర్చాయి గొంతు గాద్గదికమై పోయింది. చేతులు కళ్ళు జలదరించాయి -మెమెంటోగా పోర్టబుల్ టీవీ ని అందుకుంటూ ఉంటే ప్రపంచాన్ని జయించిన అలెగ్జాండరు కంటే గర్వపడ్డాడు,

"నేను రిటైరయినా ఈ సంస్థకోసం నా సేవలు ఎల్లప్పుడూ సిద్ధంగానే ఉంటాయని మనవి చేసుకుంటున్నాను. నిజానికి యింకో మూడు సంవత్సరాలు నా పదవీకాలం పొడిగించమని అర్జీ పెట్టుకున్నాను-కాని నా దురదృష్టంకొద్ది దేశంలో నిరుద్యోగసమస్య పెరిగిందని నా అభ్యర్థనను మేనేజిమెంటువారు తిరస్కరించారు. కాని నన్ను యింతవాణ్నిచేసిన ఈ కంపెనికి నేనెల్లప్పుడూ రుణపడి ఉంటాను - నా యందు ఆదరాభిమానాలు చూపిన మీ అందరికీ నా హృదయపూర్వక నమస్కారాలు-సెలవు!" శాస్త్రిగారు తన్నుతాను కంట్రోల్ చేసుకోలేక ఏడ్చేశారు. శాస్త్రిగారు కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి నిన్నటి సంఘటనలు గుర్తుచేసుకుంటూ ఉంటే! రోడ్ల మీద నడుస్తూ ఉంటే నలిగిన బట్టల్తో-మాసినగడ్డంతో-పీక్కుపోయిన కళ్ళతో ఉన్న ఓయువకుడు తారసపడ్డాడు.

"నమస్కారం మాష్టారు-బావున్నారా? ఆఫీసు లేదా?"

పరామర్శ అయినా శాస్త్రిగారి గుండెల్లో బాకులా గుచ్చుకుంది.

"నీకేం ఉద్యోగం దొరకలేదా?"

"దొరికితే యిక్కడెందుకు కుంటానండి? హాయిగా ఫ్యాన్ కింద కడుపులో చల్లకదల కుండా పట్టుకుని కాగితాలు పట్టుకుని కూర్చుంటాను" నిరాశతో అన్నాడు వెళ్ళిపోతూ.

జబ్బుల్లో ఎయిడ్స్‌లాగా-సమస్యల్లో మందులేనిది నిరుద్యోగసమస్య! మనుషులు పుడుతున్న నిష్పత్తుల్లో ఉద్యోగాలు ఉత్పత్తి కావడం లేదు. పెరిగే జనాభా-తరిగే ఉద్యోగఅవకాశాలు -విలోమానుపాతం! ప్చ్! ఆ యువకుడు వెళ్ళిపోయిం తర్వాత శాస్త్రిగార్కి హఠాత్తుగా ఓ నగ్నసత్యం స్ఫురించింది.

"తనూ యిప్పుడు నిరుద్యోగే!"

శాస్త్రిగారి కళ్ళముందు ముప్ఫైఐదు ఏళ్ళ క్రిందటతన పరిస్థితి గుర్తుకొచ్చింది. ఎక్కే గడప దిగేగడప. ఎవో కొన్ని చాలీచాలని ఉద్యోగాలు చేశాడు- అయిదేళ్ల తర్వాత పర్మనెంట్‌గా నిన్నటి -

కంపెనిలోచేరేదాకా. ఆ అయిదేళ్ళ జీవితం ఆయనకు మరపురాని పీడకల! శాస్త్రిగార్కి తన యిద్దరు కూతుళ్ళు గుర్తుకొచ్చారు. గజ్జల గుర్రాల్లాగాపెళ్ళికియెదిగి కూర్చున్నారు. కొడుకును చూద్దామంటే కోడలుకొంగుకు కట్టేసుకుంది. రిటైర్‌బెనిఫిట్లక్రింద మహాఅయితే ఓ లక్షచేతికివస్తుంది. కానిమారని సమాజములోఆడపిల్ల పెళ్ళిఓ పెద్ద అగ్నీ పరీక్ష! లక్షకు తన యిద్దరి ఆడపిల్లలపెళ్ళిళ్ళుచేసి అత్తారిళ్లకు పంపడం గొప్ప సంగతి. తనకు పెన్షన్ లేదు. మరి తను-తన అర్ధాంగి యెవరిదగ్గరుండాలి? తలదాచుకోవడానికికొంపా గోడులేదు. ఇన్నాళ్ళు ఒళ్ళు దాచుకోకుండా పనిచేసి గుట్టుగా సంసారం నెట్టుకొచ్చి పిల్లలకు విద్యాబుద్ధులు చెప్పించాడు- కాని- వచ్చే రిటైరుమెంటు బెనిఫిట్లు పెళ్ళిళ్ళకుపోతే తను ఏం పెట్టి భార్యను పోషించాలి? ఆలోచించేకొద్దీ శాస్త్రిగారి బుర్ర వేడెక్కిపోతున్నది. వాస్తవంకళ్ళముందు విలయనాట్యం చేస్తున్నది. నిన్న జరిగిన వీడ్కోలుసన్మానసభ మత్తు క్రమంగా తగ్గుతున్నది. కళ్ళకు కమ్మిన సంతృప్తి పొరలు కరిగిపోతున్నాయి. మనసు భారం కావడంతో-తల పట్టుకుని ఎదురుగా ఉన్న కాఫీహోటల్లోకి నడిచాడు. ఓ టేబులు ముందు కూర్చుని ఆలోచనల్లో పడిపోయాడు.

"ఏందయ్యా ఇది దోశా? ఉఫ్ మని ఊదితేగాల్లో లేచిపోయేట్టుంది. డబ్బులు తీసుకుంటూ ఎందుకయ్యా యింత మోసం?" ఎదురుగా కూర్చున్న యింకో కస్టమరు సర్వర్ను దబాయిస్తున్నాడు.

"అదంతా మాకు తెలవదుసారు-కుక్ వేసిస్తాడు-అది తీసుకొచ్చి యివ్వడమే మా బాధ్యత-"

"ఓర్నీ! రూల్సుకూడ మాట్లాడుతున్నావ్! నే చెప్పింది ప్రొప్రయిటర్‌తో చెప్పుపో." కసిరాడు. జ్ఞాపకాల పొరల్లో మెరుపు మెరిసింది-ఓర్నీ! విస్మయంగా తనముందు కూర్చున్న వ్యక్తిని చూశాడు "నువ్వు-మీరు లోకనాథం కదూ!" సంకోచంగా అడిగాడు.

అతని మోహంలో కూడ ఆశ్చర్యం-ఆనందం! "ఓర్నీ-నువ్వు శాస్త్రిగాడివి కదూ!"

"ఎంతకాలం అయిందిరామనం కల్సుకుని-" ఇంక మిత్రులుకబుర్లలో పడిపోయారు. లోకనాథం కూడ-శాస్త్రిగారితో పాటు అదేకంపెనీలో చేరాడు, కాని అతనిది తిరుగుబాటు తత్వం - అన్యాయం అక్రమం-బాసిజం యివన్నీ సహించేవాడు కాదు.

ఓ రోజు ఆఫీసర్నిచెడామడా కడిగేశాడు, "ఏంసార్, ఉద్యోగస్తులంటే మీ మోచేతికింద నీళ్ళు తాగేకుక్కలనుకున్నావా? ఏదో మీ అదృష్టం బావుండి మీరాకుర్చీలో కూర్చున్నారు. మా దురదృష్టం కొద్దీగుమస్తాగిరి వెలగబెడుతున్నాం-అంత మాత్రాన గొప్ప సుపీరియారిటీ కాంప్లెక్స్ చూపించద్దు!"

"మిస్టర్ లోకనాథం! శృతి మీరుతున్నారు!" ఆఫీసరు అరిచాడు అసహనంగా.

"నేను కాదు-అదిమీరు - అయినదానికి కానిదానికి వేలెట్టి లోసుగులు చూపిస్తూ మమ్మల్ని హీనంగా చూస్తున్నారు. మమ్మల్ని బుర్రలేని వాళ్ళుగాచూస్తున్నారు."

"నేను ఆఫీసర్‌ను- మీవర్క్ సూపర్ వైజ్ చేయాల్సిన బాధ్యత నామీదుంది. నాకు తోచిన సలహాలు యిస్తాను మీరు నడుచుకోవాలి."

"ఓర్నీ! మీరు కూడ మాలాగా ఓ సర్వెంటు! అండర్‌స్టాండ్! మీరు జీతం తీసుకుంటున్నారు - మేమూ తీసుకుంటున్నాం- మేం లాయల్‌గా ఉండాల్సింది కంపెనీకి- మీక్కాదు- కంపెనీ బాగుగోలు చూసుకుని పని చెయ్యాలి-"

"లోకం! ఊరుకోరా!" వారించాడు శాస్త్రి..

"అంటే నేను కంపెనీని చెడగొడుతున్నానా ఇడియట్!"

"ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడండి- మీ పెళ్ళాం అనుకున్నారా తిడితే పడుండటానికి!" వార్నింగ్ యిచ్చాడు.

"ఏందయ్యా- చూస్తున్నకొద్దీ రెచ్చిపోతున్నావ్- షటప్ అండ్ గెటవుట్!"

"ఒరే లోకం పదరాపోదాం-" శాస్త్రి.

"నువ్వూర్కోరా! ఈయనెవడు మనకు చెప్పడానికి- ఇవ్వాళ ఈయన అంతు తేలుస్తాను". - ఉద్రేకంతో ఊగిపోయాడు లోకనాథం.

"వాట్! నా అంతు తేలుస్తావా? నువ్వు నా క్రింద ఉద్యోగివని మర్చిపోమాకు-"

"ఒర్నీఏం చేస్తావేం- గోంగూర-?"

"యు ఆర్ సస్పెండెడ్ - గెటౌట్!"

"అ(, సారు క్షమించండి- పిల్లాజెల్లాకలవాడు!" శాస్త్రి వెంటనే ఆఫీసర్ని బతిమాలాడు- నిశ్చేష్టుడైనిల్చున్న లోక నాథంను జాలిగా చూస్తూ "మీరు సస్పెండ్‌చేస్తే వాడేం కావాలి. ఏదో తొందరపడ్డాడు- ఈ తప్పుకాయండి-"

"నో ఆఫ్టరాల్- ఓగుమస్తాకుయింతఅహంకారమా? నో ఐకాంట్ రివర్టుమై డెసిషన్" తేరుకున్న లోకనాథం శాస్త్రిని వారించాడు.

"ఒరేయ్, వీడ్ని బతిమాలేదేందిరా! ఓర్నీ నువ్వు నన్నుసస్పెండ్ చేసేదేంటి- నేనే రిజైన్ చేస్తున్నాను- తీస్కో" అంటూ ఎదురుగా ఉన్న కాగితం తీస్కుని నాలుగు ముక్కలు బరికి ఆఫీసరు మొహానకొట్టాడు. హఠాత్పరిణామానికి అతను బిగుసుపోయాడు,

"ఒరేయ్ లోకం- నీకేమైనా పిచ్చెక్కిందా? ఉద్యోగం వదిలి ఎం చేస్తావురా ఎలా బతుకుతావురా?"

"హు( ఈ ముష్టి ఉద్యోగం కంటే ఓ కిల్లికొట్టు పెట్టుకున్నా హ్యాపీగా బతకొచ్చు." తేల్చి చెప్పేశాడు.

"ఏ శాస్త్రి! కాఫీ చల్లారి పోతున్నది- తాగు" లోకనాథం హెచ్చరించాడు, అతని ఆలోచనల్ని పారదోలుతూ.

"లోకం ఎక్కడున్నావ్ ఏం చేస్తున్నావ్? రిటైరయ్యావా. నేను నిన్న రిటైరయాను-" తన గురించిచెప్పాడు గతం నుండి బయటపడి.

చిన్నగా నవ్వాడు లోకనాథం- గర్వంగా.

"ఉద్యోగం చెయ్యాల్సిన ఖర్మనాకేం? బిజినెస్ చేస్తున్నాను-దీంలో రిటైరుమెంట్ లేదు-మనం మానుకునేదాకా-" శాస్త్రినిదెబ్బకొడ్తూ చెప్పాడు,

"ఏమన్నా సంపాదించావా?"

"ఆ( ఓ పాతిక-"

"వేలే !" ఆశ్చర్యంగా అన్నాడు శాస్త్రిగారు.

"కాదు-లక్షలు-అందరికి పెళ్ళిళ్ళుచేశాను. కారుమెయిన్ టెన్ చేస్తున్నాను-"

శాస్త్రి కొట్టిన షాక్ లో నుండి బయటపడలేదు-లోకనాథం చెప్పుకు పోతున్నాడు-

"ఉద్యోగానికి రిజైన్ చేసిం తర్వాత కొంత కాలం పెట్టుబడి కోసం తంటాలుపడి చివరికి పబ్లిషింగ్ బిజినెస్‌లో సెటిలయ్యాను - రకరకాలపుస్తకాలు ప్రచురించాను - లక్షలు ఆర్జించాను ! అంతే నీలాగా ఉద్యోగంలో ఉండి ఉంటే - ?" అర్థోక్తి లో ఆగిపోయారు.

"...కరివేపాకులాగా విసిరి వెయ్యబడేవాడివి." శాస్త్రిగారు ముగించారు.

"ఆ(! కరివేపాకా?"

"ఆ(! కూరలో - పప్పులో - సాంబారులో - అన్నింట్లో వేసుకుంటాం కరివేపాకునూ -కాని తినేప్పుడు దాన్ని ఏరి అవతలపారేస్తాం-అంతే మా బతుకు అంతే- మా యవ్వనం ఉద్యోగాల్లో కరిగిపోతుంది. శరీరంలో శక్తి లేనప్పుడు బయటకు తరిమివేయబడతాం-" ముక్తయింపుగా శాస్త్రిగారు చెప్పారు భారంగా -ఆవేదనతో మౌనంగా చూస్తున్నాడు లోకనాథం

"ఒరే లోకం! కంపెనీయే నా లోకంగా ముప్పైఏళ్ళు పనిచేశాను. నువ్వు నమ్ముతావో నమ్మవో నాకున్న సెలవలు కూడ ఎప్పుడూ వాడుకోలేదు. నేను సెలవు పెడితే పనికి ఎక్కడ నష్టం వాటిల్లుతుదోనని-పబ్లిక్ హాలిడేస్‌లోనే నా పన్లు చేసుకునేవాడిని. అంతే కాదురా ఆదివారాల్లో కూడ అవసరమయినపుడు రాత్రింబవళ్ళు కష్టపడి పనిచేశాను. కాని ఏమైంది- నా వొంట్లో సత్తువలేదని -ఒక్క మూడేళ్ళు కూడ నాపదవి కాలంపొడిగించలేదు,కంపెనీ యజమాన్యం". బాధగా అన్నాడు. రుమాలుతో కళ్ళొత్తుకుంటూ.

"నీకో సంగతి తెల్సా! నీ జీతంతో ముగ్గురు కుర్రాళ్ళను పెట్టుకుంటుంది కంపెని. అదే పనికి నీకు మూడురెట్లు జీతం యివ్వాలి-చూడు కంపెనికి ఎంత లాభమో!" లోకనాథం చెప్పాడు.

"అంటే-ముసలిదై పోయిన కాడిఎద్దును-ఊరిమీదకు తోలినట్లు."

"ఇంకా నయం-నా లాంటోళ్ళు కసాయివాడికి అమ్మేసి వచ్చిన కాడికి డబ్బులు జెబులో వేసుకుంటారు." లోకనాథం మెటీరియలిస్టిక్‌గా మాట్లాడాడు.

"కాని ఒరే లోకం నా సర్వస్వంగా భావించిన సంస్థ నుండి తొలగిపోవాలంటే ఎంతో బఆధగా ఉందిరా-రిటైర్‌మెంట్ తప్పనిసరని తెలుసు-అయినా యింత బాధపడాల్సి వస్తుందని నేను ఊహించలేదు".

"ఇటీజ్ నాచురల్! నీలాంటోళ్ళు రిటైర్ కాకపోతే కుర్రాళ్ళకు ఉద్యోగాలెలా వస్తాయి!"

"నిజమేకాని - అందుకని ఉన్నవాళ్ళను ఊడకొడతారా? కాకుల్ని కొట్టి గద్దలకు వేస్తారా! ఉద్యోగవకాశాలు పెంచాలి. అయినా లోకం! కనీసం పెన్షన్ కూడ లేదు. ఓపికున్నంత కాలం చేస్తే -చేయనిస్తే- కొన్ని సమస్యలు తీరతాయి."

"పోనిద్దూ ఎంతకాలం చేస్తావు వెధవ ఉద్యోగాలు హాయిగా రెస్టుతీసుకోక." లోకనాథం మళ్ళీ కలుద్దామని చెప్పి వెళ్ళిపోయాడు. మరి బిజినెస్ టూర్‌లు వచ్చిన వాడు బిజీగా ఉన్నాడు — సహజం!

శాస్త్రిగారు రోడ్డుమీద నడుస్తున్నారు. లోకనాథం బిజినెస్‌లో పైకివచ్చాడు. అతనిక్రింద వర్కర్లున్నారు. అందుకని అతని దృక్పథం మారిపోయింది అనుకున్నారు.

"ఏమోయ్‌బాగున్నావా? ఈనెల ఎంత అయింది." కిరాణాఅంగడి ముందు ఆగి అడిగాడు.

"తొమ్మిది వందలు శాస్త్రిగారు!" బంగారయ్య చెప్పాడు.

శాస్త్రిగారు జేబులోంచి నోట్లుతీసి లెక్కపెట్టి యిచ్చారు.

"బాబయ్య! తమరు రిటైర్ అయ్యారటగా!"

"అవును బంగారయ్య నిన్న-"

"ఇంక రెస్టే రెస్టు! విశ్రాంతి తీసుకోండి."

"మరి నా సంగతి సరే- నీ సంగతేమిటి? నే ఉద్యోగంలో చేరినప్పుడు చిన్న కిల్లీ కొట్టుతో ప్రారంభించావు. మేడపైన మేడలు కట్టావు. ఊళ్ళో నాలుగు షాపులు పెట్టి నలుగురు కొడుకుల కిచ్చావు. రెండు చేతులా సంపాదిస్తున్నావు. మరి నువ్వు ఎప్పుడు విశ్రాంతి తీసుకుంటావ్?"

"మాకు విశ్రాంతి ఏమిఉంది? నాచివరి శ్వాస ఈషాపులోనే పోవాలండి. ఇంట్లో కూర్చుని ఏం చెయ్యాలండి- ఆడోళ్ళ మాదిరి అంట్లు కడగాలా, వండి వార్చాలా?" విసురుగా అన్నాడు.

"వస్తానంటూ" వచ్చేశారు. శాస్త్రిగారు హఠాత్తుగా తండ్రి రామనాథశాస్త్రిగారు గుర్తుకొచ్చారు. కళ్ళెంబడ నీళ్ళు దిరిగాయి.

"ఒరే బుజ్జీ! ఏదో స్కూల్ ఫైనల్ చదివావు. చాలురా ఇంక నాతోపాటు వైదిక కర్మలు చేసుకుని బతుకు."

"లేదు నాన్న- నేను చదువుకుని పెద్దఆఫీసరు అవుతా- నీలాగా సంచీపట్టుకుని- పిలక పెట్టుకొని యిల్లు యిల్లు తిరగను." ధైర్యంగా ఎదిరించేడు తను.

"వెధవ కాలం -వెధవ బుద్ధులు- కులవిద్యను ఏమన్నా అంటే కళ్ళుపోతాయి - ఈ వైదిక విద్య లే మిమ్మల్ని యింతవాళ్ళని చేసింది - నాకేం తక్కువైంది. ఈ ఊళ్ళో నే లేకుండా ఒక్కరోజు గడుస్తుందా?" రామనాథశాస్త్రిగారు గర్వంగా అన్నారు.

"నాన్నా రోజులు మారుతున్నాయి. బ్రాహ్మణులకు ఒకప్పటి గౌరవం లేదు. చదువులకు విలువ పెరిగింది. ఉద్యోగులకు గౌరవం పెరిగింది. హాయిగా కాలుమీద కాలువేసుకుని ఫ్యానుకింద కూర్చుని-కొన్ని గంటలు పనిచేస్తేచాలు, కడుపులో చల్ల కదలకుండా ఉంటుంది. బోల్డు రెస్పెక్టు."

"అఘోరించావు- అందుకే ఈ ఇంగ్లీషు చదువులు మనకొద్దురా అని నెత్తీ నోరూ మొత్తుకున్నా- ఈ ఎ బి సి డి లు గుమస్తాల్ని తయారు చేస్తున్నాయి. మన సంస్కృతిని - కుటుంబాల్ని నాశనం చేస్తున్నాయి. పెద్దవాడినన్న గౌరవం ఉంటే నే చెప్పినట్లు చదువు మానేసి నాకు సాయం చెయ్యి, నా తర్వాత నువ్వే ఈ ఊళ్ళో నా అంతటివాడి వవుతావు." చివరిమాటగా కొడుకుని అర్థించారు- ఊరంతటిని శాసించగల రామనాథంశాస్త్రిగార్కి తను కన్న నలుసే-కంట్లో నలుసై కలతపెట్టింది.

"క్షమించండి నాన్నా! నా బాగోగులు నాకు తెలుసు. నే చదువుకున్నాను. నా అదర్శాలు నాకున్నాయి-నేనేం కానిపని చెయ్యడంలేదు." అని నిష్కర్షగా తెగేసి చేప్పేశాడతను

అప్పుడు తండ్రిమాట వినుంటేబావుండేది. తమ్ముడు బాగానే బతుకుతున్నాడు తనకంటే. తండ్రి అడుగుజాడల్లో - తమ్ముడికి జీవనం గురించి దిగులులేదు. రెక్కాడినంతకాలం - నోట్లు నాలుకున్నంతకాలం దిగుల్లేదు. అప్పుడే కొడుక్కి ట్రైనింగ్ యిస్తున్నాడు - తానే యిలా అయిపోయాడు - పశ్చాత్తాపంతో నొచ్చుకున్నాడు.

అలవాటుబడ్డ కాళ్ళు కంపెనీ ముందు ఆగాయి.

లోపలికి వచ్చిన శాస్త్రిగార్ని చూసి అందరూ విష్‌చేశారు. కుశలప్రశ్నలు వేశారు. రిటైర్ మెంటు బెనిఫిట్లగురించి కొందరు ఈర్ష్య వ్యక్తపరిచారు. కొందరు ఈ గొడ్డుచాకిరీ తప్పిందానికి అదృష్టవంతుడన్నారు - టీ తెప్పించారు.

కాని కాసేపటికి శాస్త్రిగారికీ తెల్సింది-తనువాళ్ళ పని చెడగొడు తున్నాడని. కూసే గాడిదొచ్చి -మేసే గాడిదని - ఎక్కువ సేపు కూర్చోలేకపోయాడు.

నిన్నటిదాక తను లేకపోతే ఆఫీసు పని స్తంభించి పోతుందనుకున్నాడు-కాని- ఆఫీసు యధాప్రకారంగా నడుస్తూనే వుంది. ఎవరికీ తన సలహా అక్కరలేదు. ఎవరికీ తన లోటు పట్టలేదు-యంత్రాల్లా చేసుకుపోతున్నారు, కాని నిన్న తనుకూడా యంత్రమే. ఎక్కువసేపు వుండలేక కంపెనీ ఆఫీసునుండి బయటపడ్డాడు.

"వస్తూ వుండండి అప్పుడప్పుడు -ఇంట్లోకూర్చుని ఏం చేస్తారు." ఎవరో సానుభూతి వ్యక్తంచేశారు పుండుమీద కారం జల్లినట్లు. బయటపడి నడుస్తుంటే అర్ధాంగి నసుగు గుర్తుకొచ్చింది.

"మీకేం మగమహారాజులు! హాయిగా రిటైర్ అయ్యారు. ఏపని చెయ్యనక్కరలేదు. నాకు అలా కాదుగా- ఆడదాన్నయి పుట్టిందానికి చచ్చేంతవరకూ చాకిరిచేస్తూ చావాల్సిందే.ఒంట్లో ఓపికున్నా లేకపోయినా వండి వార్చాల్సిందే! నా సంగతి ఎవరు పట్టించుకుంటారు? నాకెప్పుడు రిటైర్‌మెంటు - ఈ జీవితం చాలించినప్పుడే!"

"పిచ్చి సావిత్రి! రిటైర్‌మెంట్ లో సుఖంలేదే! అది విశ్రాంతికాదే- జైలు విశ్రాంతి! పనిలో ఉన్నా సుఖం పనిలేమిలో లేదు.

నడుస్తున్న శాస్త్రిగార్కి కూతుళ్ళు గుర్తుకొచ్చారు. దూరపు బంధువుల సంబంధాలు కుదరొచ్చు - కాని కట్నాలు కానుకలు తను తట్టుకోలేడు. పై చదువులు చెప్పిస్తే యింకా పై చదువులు చదువుకున్న వరుళ్ళను తేవాలని చదువులు ఆపేయించాడు తను, ఇప్పుడు వాళ్ళు ఉద్యోగాలు

సంపాదించుకుని తమ కాళ్ళమీద తాము బతకలేరు. కష్టపడి ఉన్న డబ్బుల్తో వాళ్ళ పెళ్ళిళ్ళు జరిపించినా తర్వాత నాటకం ఎలా జరుగుతుందో అర్థంకావటంలేదు. మళ్ళీ పొట్ట చేత్తో బట్టుకుని ఉద్యోగం కోసం తిరగాలి – తిరగాలి ఈ వయసులో. ఇది మధ్యతరగతి మాజీ ఉద్యోగుల సమస్య! ఇన్‌సెక్యూరిటీ ఆఫ్ లైఫ్! మార్కెట్టు వచ్చింది. గుట్టలు గుట్టలుగా కూరగాయలు అమ్ముతున్నారు తాజా కూరగాయలు. జేబులోంచి సంచిగుడ్డ తీసి ఆమె దగ్గరకు వెళ్లారు.సంచీలో ఆమె యిచ్చింది తీసుకొని ఇంటికి వచ్చారు.

"మీకేమన్నా మతిపోయిందిటండీ? ఇదెక్కడి చోద్యం? సంచీ నిండా తెస్తారా? ఆవ్వ" భార్యామణి అంది.

"ఏదీ పనికిరాకుండా పోదు. కాకపోతే వాడుకోవడం తెలియాలి." ముక్తసరిగా అన్నారు.

సావిత్రమ్మ సంచిని గుమ్మరించింది.

కరివేపాకు కాడలు నేలమీదపడ్డాయి గుట్టగా.

"ఏం చేసుకోవాలి? తిర్గమాతలో ఏంత వేస్తాం! రెండ్రోజుల్లో వాడిపోయే కరివేపాకు ఏం చేసుకోను?"

"ఈ సారి కరివేపాకు పొడుంచెయ్యి – ఎంతవస్తే అంత. ఎక్కువకాలం నిలువ వుండేట్లు – మనకు అక్కరలేకపోతే మిగతా పొడుం అమ్ముదాము!" నిర్లిప్తంగా అన్నారు!

భర్తలో వచ్చిన మార్పును – కరివేపాకును మార్చి మార్చి చూసింది సావిత్రమ్మ.

